సాక్షి
ఒడిశా
మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025



**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,29,142లు, బంగారం 1 గ్రాము 650 మిల్లీగ్రాము, వెండి 4గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



**వినతుల వెల్లువ**

గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాలకు వినతులు వెల్లువెత్తాయి. అర్జీదారులు సమస్యలు ఏకరువు పెట్టారు.

- 8లో



**నది మధ్యలో 24 గంటలు**

శబరి నది మధ్యలో ఓ వ్యక్తి 24 గంటలు ఉండిపోయాడు. హెలికాప్టర్ సాయంతో బయటకు తీసుకువచ్చారు.

- 8లో

## న్యూస్‌రీల్

### సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి



విజేతలతో అతిథులు, నిర్వాహకులు

రాయగడ: మన భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాలు, కళలు, సంప్రదాయాలపై యువత అవగాహన కలిగి ఉండాలని స్థానిక అటానమస్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ గంతాయిత్ అన్నారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా స్థానిక రామక్రిష్ణనగర్‌లో ఆదివారం రాత్రి చిన్నారుల మధ్య పాటలు, నృత్య పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మన రాష్ట్రం భిన్న సంస్కృతులు, కళలకు పుట్టినిల్లన్నారు. వాటిపై యువతకు అవగాహన కలిగేలా ఇటువంటి తరహా కార్యక్రమాలను నిర్వహిస్తుండాలని అన్నారు. అయితే నేటి యువత ఆధునిక పోకడలకు బానిసై మన సంస్కృతులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయుడు అమరేంద్ర జెన్న, నృత్య శిక్షకురాలు ఆర్. ఇందిరాలు పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

### మంటల్లో చిక్కుకున్న విద్యుత్ వాహనం



నయాపల్లి వంతెనపై మంటల్లో చిక్కుకున్న స్కూటీ

భువనేశ్వర్: స్థానిక నయాపల్లి ప్రాంతంలోని ఫ్లై ఓవర్‌పై సోమవారం విద్యుత్ వాహనం (స్కూటీ) మంటల్లో చిక్కుకుంది. అదృష్టవశాత్తు స్కూటీ రైడర్ సురక్షితంగా ప్రాణాలతో బయటపడగలిగాడు. ఫ్లై ఓవర్‌పై స్కూటీపై యువకుడు ప్రయాణిస్తుండగా వాహనంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ పరిస్థితి గమనించిన మరుక్షణమే స్కూటీని ఆపి కిందకు దిగడంతో ప్రాణ హాని తప్పింది. రోడ్డుపై ఉన్న జనం చూస్తుండగా కాసేపటికే స్కూటీ దగ్ధమైంది. ఈ ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భావిస్తున్నారు.

### పులి చర్మాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న పులి చర్మాలతో నిందితులు

రాయగడ: జిల్లాలోని కొలనార ఎస్‌హెచ్ రోడ్డు సమీపంలో డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, ముంబై జోనల్ యూనిట్ అధికారులు ఆదివారం రాత్రి నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో రెండు పులి చర్మాలతో పాటు నలుగురిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ప్రభాకర్ నాయక్, రాజ్ కుమార్ గుప్తా, రాయగడ జిల్లా గునుపూర్‌లోని మఛకుంటి ప్రాంతానికి చెందిన మహేష్ హుయిక, పుటాసింగి ప్రాంతానికి చెందిన జిసయ్య గొమాంగోలు ఉన్నారు. వీరి నుంచి స్వాధీనం చేసుకున్న పులి చర్మాలతో పాటు నిందితులను రాయగడ అటవీ శాఖ రేంజ్ అధికారి కామేశ్వర్ ఆచారికి అధికారులు అప్పగించారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు.

### చెన్నైలో వలస కార్మికుడు మృతి



వలసకార్మికుడు బాలకృష్ణ ఘంట

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మాసమితి పరిడా గ్రామానికి చెందిన వలస కార్మికుడు బాలకృష్ణ ఘంట (32) చెన్నైలో శనివారం మూడంతస్తుల భవనం నుంచి జారిపడి మృతి చెందాడు. పరిడా గ్రామానికి చెందిన బాలకృష్ణ ఘంట పొట్టకూటి కోసం చెన్నై వెళ్లి భవన నిర్మాణంలో రాజమేస్త్రీ వద్ద మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ఒక ప్రైవేటు భవంతిలో పనిచేస్తుండగా మూడోఅంతస్తు వద్ద కాలు జారి పడిపోయి మృత్యువాత పడ్డాడు. ఈ సమాచారం అందుకున్న పరిడా గ్రామస్తులు చెన్నై వెళ్లి బాలక్రిష్ణ ఘంట పనిచేస్తున్న రాజ మేస్త్రీని సంప్రదించి శవాన్ని ఒడిశాలో గజపతి జిల్లాలో పరిడా స్వగ్రామానికి సోమవారం తీసుకువచ్చారు.

# గవర్నర్, సీఎంతో .. ఐఎఫ్‌ఎస్ అధికారుల సమావేశం

భువనేశ్వర్: 2000, 2001 బ్యాచ్‌లకు చెందిన భారతీయ విదేశీ సేవలు (ఐఎఫ్‌ఎస్) అధికారుల బృందం సోమవారం రాజ్ భవన్‌లో గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి, లోక్ సేవా భవన్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని కలిశారు. ఈ సందర్భంగా స్థానిక కళింగ స్టేడియంను సందర్శించారు. ఈ ఐఎఫ్‌ఎస్ అధికారుల బృందంలో రొమేనియాకు భారత రాయబారి డాక్టర్ మనోజ్ కుమార్ మహాపాత్రో, రిపబ్లిక్ ఆఫ్ స్లోవేనియాకు భారత రాయబారి అమిత్ నారంగ్, రిపబ్లిక్ ఆఫ్ మాల్టాకు భారత హైకమిషనర్ గ్లోరియా గ్యాంగ్టే ఉన్నారు. సమావేశంలో, అధికారులు ముఖ్యమంత్రితో రాష్ట్రంలో పాలన, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రపంచవ్యాప్తంగా భారత దేశం దౌత్యపరమైన సంబంధాల పటిష్టత దిశలో కార్యాచరణ తదితర అంశాలపై అధికారుల బృందం ముఖ్యమంత్రితో సంభాషించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. విదేశాలలో భారత దేశ ప్రయోజనాలను ప్రాతినిధ్యం వహించడంలో కీలక పాత్రధారులుగా న్యాయం చేసే దిశలో నిరంతరం కృషి చేయాలని అధికారుల్ని ప్రోత్సహించారు. ఈ ఏడాది రాష్ట్రంలో ప్రవాసీ భారతీయ దివస్‌ను విజయవంతంగా నిర్వహించడంపై అధికారులు ప్రశంసలు కురిపించారు. ఇది ప్రపంచ భారతీయులు, ముఖ్యంగా ఒడియాలు రాష్ట్రంతో మరింత అనుసంధానం కావడానికి ప్రోత్సహించిందని కొనియాడారు. యూరప్ దేశాల్లో నైపుణ్యం కలిగిన యువతకు పెరుగుతున్న డిమాండ్‌ను రాయబారులు వివరించారు. రాష్ట్ర యువతకు తగినంత అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకునివెళ్లారు. నైపుణ్య కార్యక్రమాల ద్వారా ఒడిశా తన యువతను సన్నద్ధం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చురుకైన చర్యలు చేపడుతుందని ముఖ్యమంత్రి వివరించారు. స్కిల్డ్ ఇన్ ఒడిశా చొరవ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన బ్రాండ్‌గా మారింది. రాష్ట్ర యువతకు ఉజ్వల భవిష్యత్ ప్రసాదిస్తుందన్నారు. యూరోప్ దేశాలలో ఒడిశా సాంస్కృతిక వారసత్వం మరియు హస్తకళలను ప్రోత్సహించడం వల్ల రాష్ట్రానికి ప్రపంచ శ్రేణి గుర్తింపు లభిస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ బృందం అధికారులు కళింగ స్టేడియంను సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడా విభాగం కార్యదర్శి, డైరెక్టర్ ఇతర సీనియర్ అధికారులతో సంభాషించారు. ఒడిశా సమగ్ర పర్యావరణ వ్యవస్థ, అట్టడుగు అభివృద్ధిపై అధికారుల బృందం దృష్టి సారించింది. ఒడిశా క్రీడా నైపుణ్యం ప్రపంచ గుర్తింపును సాధించిందని అధికారులు ప్రశంసించారు.



లోక్ సేవా భవన్‌లో ముఖ్యమంత్రితో సమావేశమైన ఐఎఫ్‌ఎస్ అధికారుల బృందం



రాజ్ భవన్‌లో గవర్నర్‌ని కలిసిన ఐఎఫ్‌ఎస్ అధికారుల బృందం





క్రీడా విజ్ఞాన కేంద్రం సందర్శనలో ఐఎఫ్‌ఎస్ అధికారుల బృందం



కళింగ స్టేడియంలో క్రీడా సౌకర్యాలు పరిశీలించిన ఐఎఫ్‌ఎస్ అధికారుల బృందం

# ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన



భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సోమవారం 4 రోజుల ఢిల్లీ పర్యటనకు బయల్దేరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి న్యూ ఢిల్లీలో జరగనున్న ద్రవ్య, సేవా పన్ను (జీఎస్‌టీ) మండలి 56వ సమావేశానికి హాజరు కానున్నారు. ఈ నెల 3, 4వ తేదీల్లో వరుసగా 2 రోజులపాటు ఈ సమావేశం కొనసాగుతుంది. ఢిల్లీ ప్రయాణానికి ముందుగా జీఎస్‌టీ మండలి సమావేశంలో చర్చనీయాంశ అంశాలపై అధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సమావేశానికి రాష్ట్రం పలు కీలక ప్రతిపాదనల్ని ప్రవేశ పెట్టే యోచనతో అడుగులు వేస్తుంది.

**ద్రవ్య, సేవా పన్ను కుదింపు**

ద్రవ్య, సేవా పన్ను వ్యవస్థలో కొనసాగుతున్న 4 స్థాయిల పన్ను వర్గన వ్యవస్థని సంస్కరించాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించనున్నారు. ఈ ప్రతిపాదన ప్రకారం ద్రవ్య సేవా పన్ను 4 స్థాయిల నుంచి 2 స్థాయిలకు పరిమితం చేయాలని యోచిస్తున్నారు. ప్రస్తుతం 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం ద్రవ్య, సేవా పన్ను రేటు వ్యవస్థ కొనసాగుతుంది. దీన్ని 2 స్థాయిల విధానానికి మార్చడంతో ద్రవ్య, సేవా పన్ను వ్యవస్థ సరళీకృతం చేసేందుకు మార్గం సుగమం అవుతుందని ప్రతిపాదించనున్నారు. ఈ లెక్కన నిత్య అవసర ద్రవ్యాలు, సేవలకు 5 శాతం పన్ను, అత్యవసర ద్రవ్య, సేవలకు 18 శాతం పన్ను వ్యవస్థని ప్రతిపాదించనున్నారు. విలాసవంతమైన కార్లు, పొగాకు తదితర వర్గీయ ద్రవ్యాలు, సేవలకు 40 శాతం పన్ను ప్రవేశ పెట్టాలని మండలి సమావేశంలో చర్చనీయాంశంగా ప్రవేశ పెట్టనున్నారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు న్యూ ఢిల్లీ యశోభూమిలో జరిగే సెమికాన్ ఇండియా 2025 కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఈ కార్యక్రమంతో పాటు పలు ఇతర కార్యక్రమాల్లో ఆయన పాల్గొనే అవకాశం ఉంది. రాష్ట్ర సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడంపై చర్చలకు కూడా ఆయన హాజరయ్యే అవకాశం ఉంది. ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులు, కేంద్ర నాయకులతో ముఖ్యమంత్రి సమావేశాలు ఉంటాయని భావిస్తున్నారు. రాష్ట్రంలో సంస్థాగత ఏర్పాటుతో సహా వివిధ విషయాలను చర్చించనున్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న మంత్రి పదవులు మరియు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవులను భర్తీ చేయడం గురించి కూడా చర్చలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యమంత్రి తన పర్యటన సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో చర్చలు జరిపితే, రాష్ట్ర మంత్రి మండలి పునర్వ్యవస్థీకరణ, విస్తరణపై ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసే అవకాశం ఉంది. రాష్ట్రంలో 6 మంత్రి పదవులు, వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్ పదవులు ఏడాదికి పైగా ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీ పట్ల సర్వత్రా ఉత్కంఠ నెలకొని ఉంది.

# 100 కిలోల గంజాయి పట్టివేత





పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

- ముగ్గురి అరెస్టు

మల్కన్‌గిరి: గంజాయి రవాణా గుట్టురట్టయింది. కారులో తరలిస్తున్న వంద కిలోల గంజాయని మల్కన్‌గిరి జిల్లా పోలీసులు ఆదివారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న ముగ్గురిని అరెస్టు చేశారు. మల్కన్‌గిరి సమితి చంపాకారి గ్రామ చెక్‌పోస్టు వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సబ్‌ఇన్‌స్పెక్టర్ సర్వేశ్వర్ బోయి మల్కన్‌గిరి నుంచి జయపురం వైపు వేగంగా వస్తున్న కారును ఆపి తనిఖీలు చేశారు. అందులో నాలుగు బస్తాల్లో గంజాయి ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అందులో ఉన్న ముగ్గుర్ని అరెస్టు చేశారు. సోమవారం నిందితులను విచారించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన లాలా యాదవ్, గోలాక్ భీశ్వస్, బీహార్‌కు చెందిన లాలాజీ రాజ్బర్ కలిసి గంజాయిని ఛత్తీస్‌గఢ్ తరలించేందుకు కారులో వచ్చి బలిమెల ప్రాంతంలోని కొనుగోలు చేసి తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడ్డ గంజాయిని తూకం వేయగా వంద కిలోలు ఉందని.. దీని విలువ సుమారు రూ. 25 లక్షలు ఉంటుందని ఐఐసీ రీగాన్‌కీండో తెలిపారు. పట్టుబడిన వారి నుంచి ఏడు వేల రూపాయల నగదు, మూడు సెల్‌ఫోన్లు, ఆధార్‌కార్డులు స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించాలన్నారు.

## సెప్టెంబరు 5న మాజీ మంత్రి ఎన్.రఘువీరా రెడ్డి రాక

పర్లాకిమిడి: మాజీ మంత్రి ఎన్.రఘువీరా రెడ్డి సెప్టెంబరు 5న గజపతి జిల్లాలో పర్యటించనున్నట్టు డీసీసీ అధ్యక్షులు, మోహన నియోజకవర్గం ఎమ్మెల్యే దాశరథి గోమాంగో విలేకరులకు తెలియజేశారు. గజపతి జిల్లాలో శ్రీయాన్ అభియాన్ కార్యక్రమం పర్లాకిమిడి నుంచి ప్రారంభం కానుంది. దీనికి ఏఐసీసీ తరఫున సీడబ్ల్యూసీ సభ్యులు మాజీ మంత్రి ఎన్.రఘువీరా రెడ్డిని అఖిల భారత కాంగ్రెస్‌కమిటీ ఒడిశా పర్యవేక్షకునిగా నియమించారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తరఫున చిన్నయి బెహరా, శ్రీకృష్ణచంద్ర పతి, నిరుపమా పాత్రోలను గజపతి జిల్లా కాంగ్రెస్ పర్యవేక్షకులుగా నియమించారని తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక పీడబ్ల్యూడీ బంగళాలో డీసీసీ అధ్యక్షులు దాశరథి గోమాంగో ఆధ్వర్యంలో ముందస్తు సమావేశాన్ని జరిపారు. ఈ సమావేశంలో గజపతి జిల్లాలో రెండు నియోజికవర్గాలు పర్లాకిమిడి, మోహన నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. మాజీ వైస్ చైర్మన్ సంజయ్ కుమార్ అధికారి, మహిళా నేత్రి జాస్మిన్ షేక్, సంతు రోథో తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి పీడబ్ల్యూడీ బంగ్లాలో డీసీసీ అధ్యక్షుడు, మోహన కాంగ్రెస్ ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, తదితరులు.

## అదుపుతప్పి.. ఇంట్లోకి దూసుకుపోయి..

- ఇద్దరికి గాయాలు



ఇంట్లోకి దూసుకుపోయిన కారు

రాయగడ: జిల్లాలోని టికిరి పోలీస్‌స్టేషన్ పరిధి సనోమట్టికొన గ్రామంలో కారు అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న ఓ ఇంట్లోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో కారు డ్రైవర్‌తో సహా అందులో ప్రయాణిస్తున్న ఒకరు గాయపడ్డారు. చంద్రమణి నాయక్ అనే మహిళ ఇల్లు దెబ్బతింది. సమాచారం తెలుసుకున్న టికిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంలో గాయపడిన వారిని టికిరిలోని ఉషాపాడు ఆస్పత్రికి తరలించారు. ఆదివారం అర్ధరాత్రి కంసారిగుడ నుంచి టికిరికి వస్తున్న కారు అదుపుతప్పి ఇంటిలోకి దూసుకుపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంటిని నష్టపోయిన బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. కారు డ్రైవర్, గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆఫ్ఘన్ మృతులకు గవర్నర్ సంతాపం

భువనేశ్వర్: ఆఫ్ఘనిస్తాన్‌లో సంభవించిన వినాశకరమైన భూకంపం తీవ్ర విషాదకరం. ఈ విషాద సంఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి సంతాపం ప్రకటించారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## తుపాకీ గురి పెట్టిన మంత్రి

భువనేశ్వర్: రాష్ట్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి సూర్య వంశీ సూరజ్ తుపాకీ గురి పెట్టిన దృశ్యం అందరి దృష్టిని ఆకట్టుకుంది. స్థానిక కళింగ స్టేడియంలో జరుగుతున్న 14వ ఒడిశా రాష్ట్ర షూటింగ్ ఛాంపియన్‌షిప్ క్రీడోత్సవం ప్రారంభం ప్రాంగణంలో మంత్రి కట్టి తుపాకీతో గురి పెట్టి క్రీడా స్ఫూర్తిని చాటుకున్నారు.



తుపాకీ గురి పెట్టిన రాష్ట్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి సూర్య వంశీ సూరజ్

# శ్రమ కోడ్‌ను రద్దు చేయాలి





నినాదాలు చేస్తున్న ఏఐయూటీయూసీ నాయకులు

- ఏఐయూటీయూసీ డిమాండ్

జయపురం:కార్మికులపై కేంద్ర ప్రభుత్వం విధించిన చిన శ్రమ కోడ్‌ను రద్దు చేయాలని ఆల్ ఇండియా యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐయూటీయూసీ)డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఏఐయూటీయూసీ కొరాపుట్ జిల్లా శాఖ జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగులో స్థానిక సమస్యలపై ఆందోళన నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ బిశాయి నేతృత్వంలో కార్యకర్తలు ప్లకార్డులు చేత బట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బిశాయి నాయకత్వంలో దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీని ఉద్దేశించిన 25 డిమాండ్లతో కూడిన మెమోరండాన్ని బొయిపరిగుడ సమితి బీడీవోకు సమర్పించారు. కార్మికుల ప్రయోజనాలను హక్కులను కాలరాసేలా ఉన్న శ్రమ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులకు సరైన మద్దతు ధరలు ప్రకటించాలని, నిత్యావసర, అత్యవసర సరుకుల ధరలు నియంత్రించాలని, కార్మికులకు నెలకు కనీస వేతనం 26 వేల రూపాయలు చేయాలని, నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పించాలని, లేదా వారికి పెన్షన్ చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ బిశాయి ప్రసంగిస్తూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వ, రాష్ట్రంలో మోహణ మఝి ప్రభుత్వాలు కార్మిక, రైతు, ప్రజల ప్రయోజనాలను కాల రాస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తుండటంతో దేశంలో నిరుద్యోగులు పెరుగుతున్నారని దుయ్యబట్టారు. రోజు రోజుకు నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలను అంటుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. ధరలను నియంత్రించటంలో బీజేపీ ప్రభుత్వాలు విఫలం కావటంతో ప్రజలు కొనుగోలు శక్తిని కోల్పోతున్నారన్నారు. దేశంలో పేదరికం పెరుగుతుండగా ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారన్నారు. అందుకు ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వ విధానాలేనని నిందించారు.అందుచేత గ్రామికులు, రైతులు, ప్రజలు తమ హక్కుల సాధనకు పోరాటమే సరైన మార్గం అన్నారు.

# పికప్ వ్యాన్‌ను ఢీకొన్న ట్యాంకర్



ప్రమాద స్థలంలో మృతి చెందిన పికప్ వ్యాన్ డ్రైవరు



మృతి చెందిన పశువులు

రాయగడ: పికప్ వ్యాన్‌ను ట్యాంకర్ ఢీకొన్న ఘటనలో వ్యాన్ డ్రైవర్‌తో సహా రెండు పశువులు మృతి చెందిన ఘటన జిల్లాలోని అంబొదల పోలీస్ స్టేషన్ పరిధిలో గల బొడొమంజారికుపా సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ప్రమాదంలో మృతి చెందిన పికప్ వ్యాన్ డ్రైవర్‌ను పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా ప్రశాంతిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన చందాక పవన్ కుమార్ (29)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేశారు. పశువుల లోడుతో పికప్ వ్యాన్ జిల్లాలోని అంబొదల నుంచి మునిగుడ వైపు వెళ్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన డీజిల్ ట్యాంకర్ అదుపు తప్పి పికప్ వ్యాన్‌ను ఢీకొంది. ప్రమాదం అనంతరం ట్యాంకర్ డ్రైవర్, హెల్పర్లు పరారైనట్లు సమాచారం.

# సీఎంను కలిసిన శ్రీ మందిరం కొత్త పాలక మండలి సభ్యులు



ముఖ్యమంత్రితో శ్రీ మందిరం పాలక మండలి సభ్యులు

భువనేశ్వర్:

పూరీ శ్రీ జగన్నాథ ఆలయం కొత్త పాలక మండలి సభ్యుల బృందం రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో లోక్ సేవా భవన్‌లో సోమవారం భేటీ అయింది. పూరీని దేశంలోనే అత్యుత్తమ మతపరమైన, పర్యాటక కేంద్రంగా పూరీ శ్రీ క్షేత్రాన్ని తీర్చిదిద్దడంలో ప్రభుత్వం ప్రక్రియను ప్రారంభించింది. శ్రీ జగన్నాథుని సేవలు, శ్రీ మందిరం బహుముఖాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా మద్దతును అందిస్తూనే ఉంటుందని ముఖ్యమంత్రి అభయం ఇచ్చారు. శ్రీ క్షేత్రానికి విచ్చేసే భక్తులు, యాత్రికులు, పర్యాటకుల కోసం పూరీ నగరంలో అనేక సౌకర్యాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా తెలిపారు. శ్రీ మందిరంలో నిత్య దైనందిన సేవాదులతో ఉత్సవాలు, పండగ పబ్బాలు వంటి ప్రత్యేక సందర్భాల్లో ఆలయ విధివిధానాలు, ఉత్సవాల నిర్వహణ క్రమబద్ధీకరణతో పూరీ పట్టణ ప్రాంతదం అభివృద్ధిని వేగవంతం చేయడంపై పాలక మండలి సభ్యులు ముఖ్యమంత్రితో చర్చించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పాలక మండలి సభ్యులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. శ్రీ మందిరం కొత్త పాలక మండలి నుంచి కృష్ణచంద్ర సామంతరాయ (సువార్‌వర్గం ప్రతినిధి), రఘుబీర్ దాస్ (మఠాధీష్), రామనారాయణ గొచ్చికర్ (ప్రతిహారి నియోగ్), మధుసూదన్ సింఘారి (పుష్పాలక్ నియోగ్), జగన్నాథ్ పూజా పండాతో కూడిన ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసింది.

## క్లుప్తంగా

### నేటి నుంచి జాతీయ ఆహార భద్రతా కమిషన్ పర్యటన

**పర్లాకిమిడి:** గజపతి జిల్లాకు ఒడిశా రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు (భువనేశ్వర్) మంగళవారం నుంచి వరుసగా మూడు రోజులు గుమ్మా, మోహనా, గుసాని సమితుల్లో పర్యటించనున్నారు. జాతీయ ఆహార భద్రత పథకం కింద బి.పి.ఎల్, దిగువ తరగతి ప్రజలకు రేషన్ సక్రమంగా అందుతున్నది, లేనిదీ తనిఖీలు చేయనున్నారు. ఈ ఫుడ్ కమిషన్‌లో సభ్యులుగా ప్రియవ్రత సామంతరే, అక్షయ కుమార్ బెహరా, దయానిధి దాస్ ఉన్నారు. 2వ తేదీ ఉదయం గుమ్మా బ్లాక్ రోడ్ ప్రయాణంలో ఐ.సి.డి.ఎస్ ఆధీనంలో ఉన్న మధ్యాహ్న భోజన పథకం, ట్రైబల్ పి.డి.ఎస్, ఎస్.ఎన్.పిలు, షెడ్యూల్డు కులాల ఆశ్రమ పాఠశాలలు, సేవాశ్రమాలను తనిఖీ చేపట్టనున్నారు. మధ్యాహ్నం గుమ్మాబ్లాక్ అధికారులతో సమావేశం అవుతారు. 3న ఉదయం 9 గంటలకు జిల్లాలో మోహనా బ్లాక్, మధ్యాహ్నం 3 గంటలకు గుసాని సమితిలో పలు ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేపట్టనున్నారు. 4న జిల్లా కలెక్టరేట్‌లో పాలనాధికారి, జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష చేపట్టనున్నారని జిల్లా కలెక్టర్ మధుమిత తెలియజేశారు.

### ప్రాథమిక చికిత్సపై శిక్షణ



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న డాక్టర్ సాహు

**రాయగడ:** ప్రాథమిక చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ సమాజ సేవకుడు, విశ్రాంత హోమియో వైద్యుడు లక్ష్మీ నారాయణ సాహు అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ సమావేశం హాల్‌లో సోమవారం లేడీస్ క్లబ్ ద్వారా నిర్వహించిన ప్రాథమిక చికిత్స శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సాహు మాట్లాడుతూ.. గుండెపోటు వంటి ప్రమాదకర పరిస్థితులు ఎదురైనప్పుడు ఎలా స్పందించాలి, తీసుకోవాల్సిన ప్రాథమిక చర్యలను వివరించారు. సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. పాము, కుక్క కాట్లకు గురైనప్పుడు ఎలా స్పందించాలి, ఎటువంటి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి, ఎటువంటి ప్రాథమిక చికిత్స చేపట్టాలో అవగాహన కల్పించారు. క్లబ్ అధ్యక్షురాలు కస్తూరి సాహు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సాహుని సత్కరించారు.

### సెల్‌ఫోన్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం



టవర్‌పై యువకుడు



టవర్ పైనుంచి దింపుతున్న రెస్క్యూ సిబ్బంది

**శ్రీకాకుళం క్రైమ్:** పెళ్లికి యువతి నిరాకరించిందనే కారణంతో ఆత్మహత్య చేసుకుంటానని యువకుడు సెల్‌ఫోన్ టవర్ ఎక్కిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం వేకువజామున 3.30 గంటల సమయంలో శ్రీకాకుళం నగరంలోని పాత దీప మహల్ సమీప టవర్ మీదకు ఒక యువకుడు అవలీలగా ఎక్కాడు. ఉదయమయ్యేసరికి అటుగా వెళ్లే ప్రజలు గమనించారు. ల్యాప్‌టాప్ పట్టుకుని సిగ్నల్స్ దొరకక అక్కడ కూర్చుని ఉన్నాడని అనుకున్నారు. అయితే ఎంతకీ దిగకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటాడేమోనన్న ఆందోళనతో ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణకు సమాచారమిచ్చారు. సరిగ్గా ఉదయం 8 గంటలకు అగ్నిమాపక కార్యాలయానికి కూడా కాల్ వెళ్లింది. అంతే క్షణాల్లో ఘటనా స్థలానికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకున్నారు. 8.45 గంటలకు ఎస్ఐ హరికృష్ణ చొరవతో అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ పూర్తి చేసి యువకుడిని కిందికి దించగలిగారు.

**ఇదీ విషయం...**

పొందూరు మండలంలోని కింతలి గ్రామానికి చెందిన విభూది శివకుమార్ (30) అనే యువకుడు ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంబాద్‌కు చెందిన ఒక యువతిని గత ఐదేళ్లుగా ప్రేమిస్తున్నాని.. ప్రేమకు అంగీకరించిన యువతి వివాహానికి నిరాకరించిందని పోలీసుల వద్ద చెప్పాడు. దీనికి కారణం వారి పెద్దలేనని.. భరించలేకే ఇలా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని పేర్కొన్నాడు. ఈ ఘటనపై ఎస్ఐ ఎం.హరికృష్ణ మాట్లాడుతూ గ్రామ పెద్దలు, తల్లిదండ్రుల సమక్షంలో చట్ట పరిధిలో ఇటువంటి వ్యవహారం పరిష్కరించుకోవాలని సూచించారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే చట్టప్రకారం తాము న్యాయం చేస్తామని యువకుడికి హామీ ఇచ్చి రిమ్స్‌కు పంపించారు.



రాయగడ: సాయిప్రియనగర్ ప్రాంత సమస్యలను వింటున్న కలెక్టర్



మల్కన్‌గిరి: గ్రీవెన్స్‌సెల్‌కు హాజరైన వివిధ శాఖల ఉద్యోగులు



మల్కన్‌గిరి: కలెక్టర్‌కు సమస్యలు చెప్పుకుంటున్న ప్రజలు

# వినతుల వెల్లువ

**పర్లాకిమిడి:**

గజపతి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్, గ్రామ ముఖిపరిపాలనకు అధిక స్పందన లభించింది. కలెక్టర్ మధుమిత, ఎస్పీ జ్యోతింద్రకుమార్ పండా, జిల్లా పరిషత్ సీడీఎం శంకర కెరకెటా, జిల్లా అటవీశాఖ అధికారి కె.నాగరాజు వినతులు స్వీకరించారు. మొత్తంగా 75 వినతులు అందాయి. వాటిలో రెండింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. వ్యక్తిగతం 58, గ్రామ సమస్యలకు సంబంధించినవి 17 వినతులు వచ్చాయి. ముగ్గురు నిస్సహాయులుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.70 వేల ఆర్థిక సహాయాన్ని కలెక్టర్ అందజేశారు. సీడీఎంఓ డాక్టర్ ఎం.ఎం.ఆలీ, సబ్ కలెక్టర్ అనుప్ పండా, గుసాని బీడీఓ గౌరచంద్ర పట్నాయక్, తదతరులు పాల్గొన్నారు.

**వినతుల స్వీకరణ..**

**రాయగడ:** స్థానిక డీఆర్‌డీఏ సమావేశం హాల్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణి వినతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి 77వినతులు వచ్చాయి. ఇందులో 69 వ్యక్తిగతం, 8 గ్రామ సమస్యలుగా గుర్తించారు.

**ఆరుగురికి రూ.70 వేల సహాయం..**

వినతుల స్వీకరణలో భాగంగా ఆరుగురుకి కలెక్టర్ వైద్య ఖర్చుల నిమిత్తం రెడ్ క్రాస్ నిధుల నుంచి రూ.70 వేలను మంజూరు చేశారు. వారి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా సీడీఎంఓ సిఫారసు మేరకు ఆర్థిక సహాయాన్ని అందించారు.

**మౌలిక సౌకర్యాలు కల్పించండి..**

రాయగడలోని సాయిప్రియ నగర్‌లో గల పలు వీధుల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆ ప్రాంత వాసులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కొత్తగా ఏర్పాటైన ఈ ప్రాంతం గత పదేళ్లలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఇటు పంచాయతీ పరిధిలోకి చెందక, అటు మున్సిపాలిటీ పరిధిలోని లేక అభివృద్ధికి దూరం ఉందన్నారు. గతకొద్ది ఏళ్లుగా సాయి ప్రియ నగర్‌లో దొంగతనాలు అధికమయ్యాయన్నారు. భద్రతను దృష్టిలో పెట్టుకుని పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి కులదీప్‌కుమార్‌తో చర్చించారు. సమస్యలపై సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు. సమస్యలను సంబంధితశాఖ అధికారులు పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డీఎఫ్ఓ అన్నా సాహేబ్, సబ్ కలెక్టర్ రమేష్ చంద్ర జెన్నా, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అక్షయకుమార్ ఖెముండొ, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



రాయగడ: వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న అధికారులు



పర్లాకిమిడి: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మధుమిత

**గ్రీవెన్స్‌సెల్‌కు 45 వినతులు**

**మల్కన్‌గిరి:** మల్కన్‌గిరి జిల్లా మద్మాగిరి పంచాయతీలో సోమవారం గ్రీవెన్స్‌సెల్‌ను అధికారులు నిర్వహించారు. కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 45 వినతులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినతులను క్షుణ్ణంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని వివిధశాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో రైతులకు యురియా సమస్య ఎక్కువగా ఉన్న నేపథ్యంలో దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. జిల్లా ఎస్పీ వినోద్ పాటిల్, జిల్లా అభివృద్ధిశాఖ అధికారి నరేశ్ కుమార్ సభరో పాల్గొన్నారు.

## నది మధ్యలో 24 గంటలు..

**మల్కన్‌గిరి :** మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి కత్తమట్టేర్ గ్రామానికి చెందిన ఇర్మసోడి అనే వ్యక్తి ఆదివారం శబరి నదిలో పడిపోయాడు. పడవపై వెళ్తుండగా నీటి ప్రవాహానికి పడవ బోల్తా పడింది. దీంతో ఆయన ఓ చెట్టు కొమ్మను పట్టుకుని ఉండిపోయాడు. ఆయనను చూసిన వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో దోర్నపాల్‌వద్ద ఉన్న బీఎస్ఎఫ్ జవాన్లహెలికాప్టర్ ద్వారా సోమవారం రక్షించారు. 24 గంటలు అతడు నీటి మధ్యలోనే ఉండిపోయాడు. బయటకు వచ్చాక జవాన్లకు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



సురక్షితంగా బయటకు వచ్చిన ఇర్మ సోడి



నది నుంచి హెలికాప్టర్ ద్వారా బయటకు తెస్తున్న దృశ్యం

## స్వాతంత్ర్య సమరంలో అవిభక్త కొరాపుట్‌పై చర్చ

**జయపురం:** దేశ స్వాతంత్ర్య సమరంలో అవిభక్త కొరాపుట్ భూమికపై జయపురం పూజ్య పూజా సంసద్ విభాగం ఆధ్వర్యంలో మాసిక సాహితీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా స్వాతంత్ర్య పోరాటంలో కొరాపుట్ భూమికపై సాహితీ ప్రియులు చర్చించారు. పూజ్య పూజా సంసద్ ఉపాధ్యక్షులు తపనకిరణ త్రిపాఠీ అధ్యక్షతన జరిగిన చర్చా వేదికకు సాహితీవేత్త, జయపురం సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షులు హరిహర కరసుధా పట్నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కవియిత్రులు భావచంద్రికా దేవి, అనంత బిజయ ధీవర్ అతిథులుగా పాల్గొన్నారు. అనసూయ సామంతరాయ్, ప్రమోద్ కుమార్ రౌళో, జానకీ పాణిగ్రాహి, భగవాన్ సాబత్, నారాయణ సాగర్, ఝున్ను పండ, సంధ్యా రాణి సాహు. ప్రతీత సాహు పాల్గొని చర్చించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరంలో ఎరుపెక్కిన కొరాపుట్‌లో స్వాతంత్ర్య యోధుల భూమికపై కవితలు వినిపించారు. అనంతరం పూజ్యపూజా సంసద్ అధ్యక్షులు ఉదయ శంఖర జాని ఆధ్వర్యంలో కవితా పఠన కార్యక్రమంలో పలువురు ఔత్సాహిక రచయితలు స్వాతంత్ర్య పోరాటంలో అవిభక్త కొరాపుట్ లో జరిగిన ఘట్టాలపై తమతమ స్వీయ రచనలను చదివి వినిపించారు. కవితలను పూజ్యపూజ సంసద్ సాధారణ కార్యదర్శి బైరాగీ చరణ సాహు సమీక్షించారు. సంసద సహాయ కార్యదర్శి మృత్యుంజయ సాహు ధన్యవాదాలు తెలియజేశారు.



సాహితీ సమావేశంలో అతిథులు

## వృక్ష సంపదే జీవరాశి మనుగడకు మూలాధారం



మొక్కలు నాటుతున్న ఎన్.సి.సి, రోటరీ సభ్యులు

**జయపురం:** వృక్ష సంపదే జీవరాశి మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు మూలాధారమని జయపురం రోటరీ క్లబ్ కరస్పాండెంట్ నిశాన్ పట్నాయక్ అన్నారు. సోమవారం జయపురం రోటరీ క్లబ్, విక్రమదేవ్ విశ్వ విద్యాలయ ఎన్.సి.సి కేడర్ సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. జయపురం విశ్వవిద్యాలయ ప్రాంగణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 100కు పైగా వివిధ రకాల మొక్కలను నాటినట్లు జయపురం రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆర్.టి.ఎస్.అమర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి నారస్ నిశంఖ, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి

**జలుమూరు:** మండలంలోని కూర్మనాథపురం గ్రామానికి చెందిన మొయ్యి దాలినాయుడు(40) చెరువులో పడి ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారి మాదిరిగానే సాయంత్రం గ్రామ శివారున ఉన్న పిల్లల కోనేరు వద్దకు దాలినాయుడు స్నానానికి వెళ్లాడు. దీంతో ప్రమాదవశాత్తు అందులో జారిపడి మృతి చెంది ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి అయిన ఎంతసేపటికీ ఇంటికి రాకపోగా చెరువు వద్దకు వెళ్లి చూడగా చెరువులో మృతదేహం గుర్తించినట్లు తెలిపారు. మృతుడికి భార్య జగది, కుమారుడు సంతోష్ ఉన్నారు. జలుమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### ఏఎస్ఐ మృతి

**పోలాకి:** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ ఆదినారాయణ అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు. గత కొన్నేళ్లుగా కాలిపై ఏర్పడిన గాయంతో బాధపడుతూ జెమ్స్‌లో చికిత్స పొందుతున్న సమయంలో ఆర్గాన్స్ పనితీరులో అంతరాయం ఏర్పడి మరణించారు. ఆదినారాయణ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసేవారని గుర్తుచేసుకున్నారు. స్టేషన్ సిబ్బంది నివాళులర్పించారు.

### రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

**పలాస:** పలాస – కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పద్మనాభపురం పాత జాతీయ రహదారి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి స్కూటీ బోల్తాపడడంతో అంబుసోలి గ్రామానికి చెందిన కమ్మల సత్యతో పాటు చీమల కల్పనకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం వారిని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొని వెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సొంత నిధులతో కల్వర్టు నిర్మాణం

**జయపురం:** కుండపోత వర్షాలకు జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి దొండాబడి పంచాయతీ పనసపుట్ గ్రామ సమీప రోడ్డులో కల్వర్టు కొట్టుకుపోయిన విషయం పాఠకులకు విదితమే. దొండాబడి– చికాపూర్ మధ్య గల కల్వర్టు కొట్టుకుపోవటం వలన ఆ పంచాయతీలో 25 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దొండాబడి పంచాయతీ సర్పంచ్ చెండియ ఖీలో ఈ విషయాన్ని అధికారు దృష్టికి తీసుకువెళ్లారు. పంచాయతీ ప్రజల ఇబ్బందులను వివరించి, వెంటనే కల్వర్టును బాగు చేయాలని కోరారు. అధికారులు పట్టించుకోలేదు. సర్పంచ్ తన సొంత డబ్బుతో కల్వర్ట్‌ను బాగు చేసేందుకు నడుం బిగించారు. ప్రధాన మంత్రి గ్రామ షడక్ యోజనలో మూడేళ్ల కిందట నిర్మించిన కల్వర్టు గతంలో వర్షాలకు రెండు పర్యాయాలు కూలిపోయింది. అధికారులు పట్టించుకోకపోవటంతో ఆ రెండు సార్లు సర్పంచ్ ఖీలో తన సొంత డబ్బుతో బాగు చేయించారని ప్రజలు తెలిపారు. నేడు కూడా వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టును సొంత డబ్బులు ఖర్చు పెట్టి బాగు చేయిస్తున్నారు. సర్పంచ్‌కు పంచాయతీలోని 9వ వార్డు మెంబర్ అభి గౌడ సహకరిస్తున్నారు.



వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టును బాగు చేస్తున్న దృశ్యం

## 'మత సామరస్యం ముఖ్యం'

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** జిల్లాలో శాంతి-సామరస్యాలు నిలబెట్టడమే మతసామరస్య కమిటీ లక్ష్యమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా మత సామరస్య కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ మతాలను అనుసరించే ప్రజల్లో అపార్థాలు, విభేదాలు రాకుండా కమిటీ కృషి చేస్తుందన్నారు. పండుగలు శాంతియుత వాతావరణంలో, మత సామరస్యంతో జరగాలన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఎస్పీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 672 సీసీ కెమెరాలు అమర్చారని, మిగిలిన ప్రార్థనా స్థలాల్లో కూడా తప్పనిసరిగా వాటిని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. తర్వాత మత పెద్దలు తమ ప్రాంతాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు.

## పథకం ప్రకారమే రాజశేఖర్ హత్య

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- ఆగస్టులో కత్తి కొనుగోలు చేసిన నిందితుడు



హత్యకు వినియోగించిన కత్తి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అవతారం

**జి.సిగడాం:** స్నేహితుడి చేతిలో గత నెల 24న హత్యకు గురై, చికిత్స పొందుతూ గెడ్డకంచరాం గ్రామానికి చెందిన పుక్కళ్ల రాజశేఖర్ మృతి చెందిన కేసులో ముద్దాయి దమరసింగి గొల్లబాబు అలియాస్ శంకర్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేసి పొందూరు కోర్టుకు తరలించారు. ముద్దాయికి రిమాండ్ నిమిత్తం శ్రీకాకుళం జైలుకు తరలించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం కేసు వివరాలు వెల్లడించారు.

**ఇంటి నుంచి కత్తి తీసుకొచ్చి**

మండలంలోని గెడ్డకంచరాం – బాతువ కూడలి వద్ద పుక్కళ్ల రాజశేఖర్ (35)ను గొబ్బూరు గ్రామానికి చెందిన దమరసింగి గొల్లబాబు(శంకర్) పథకం ప్రకారమే హత్య చేశాడని సీఐ తెలిపారు. గెడ్డ కంచరాం గ్రామంలో తోటి స్నేహితుడు మేస్త్రీ అప్పన్న ఇంట్లో ఒక శుభ కార్యానికి రాజశేఖర్, శంకర్ అనే వ్యక్తితో కలిసి వెళ్లాడు. అక్కడ స్నేహితుడు ఇచ్చిన మద్యం సేవించారు. ముద్దాయి గొల్లబాబు ఆలస్యంగా వెళ్లి మద్యం అడగగా.. వారు అప్పటికే మద్యం అంతా తాగేశామని చెప్పడంతో మద్యం విషయంలో ఇద్దరూ గొడవకు దిగారు. ఈ గొడవను అవకాశంగా తీసుకుని ముద్దాయి శంకర్ తన ఇంటి వద్ద భద్రపరుచుకున్న కత్తిని తీసుకొచ్చి రాజశేఖర్‌కు ఫోన్ చేశాడు. ఆయన లిఫ్ట్ చేయకపోవడంతో లక్ష్మణ్ అనే వ్యక్తికి ఫోన్‌చేసి రాజశేఖర్ ఎక్కడ ఉన్నాడని అడిగాడు. అయితే గొడవలు వద్దని లక్ష్మణ్ సూచించాడు. అనంతరం మృతుడు రాజశేఖర్, లక్ష్మణలు నడిచి వస్తుండగా గెడ్డకంచరాం గ్రామ కూడలి వద్ద మృతుడు రాజశేఖర్, ముద్దాయి గొల్లబాబు ఘర్షణ పడ్డారు. ఈ సమయంలో రాజశేఖర్ కడుపులో పదునైన కత్తితో గొల్లబాబు పొడిచాడు. దీంతో వెంటనే లక్ష్మణ్ తన బైక్‌తో జి.సిగడాం ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లాడు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో శ్రీకాకళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆగస్టు 25న మృతి చెందాడు. మృతుడు భార్య హరిప్రియ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

**మారణాయుధాలు స్వాధీనం**

మృతుడు రాజశేఖర్‌తో గత కొన్ని రోజులుగా ముద్దాయి శంకర్‌కు గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆగస్టు నెలలోనే హత్య చేసేందుకు ఆన్‌లైన్ ద్వారా పదునైన కత్తిని కొనుగోలు చేశాడు. దీంతో హత్యకు ఉపయోగించిన కత్తిని ఎస్ఐ మధుసూదన రావు స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ సిబ్బంది సహకారంతో ముద్దాయి ఇంటి చుట్టూ తనిఖీ చేశారు. హత్య జరిగిన వారం రోజుల్లోనే ముద్దాయితో పాటు ఆయుధాలను సేకరించి, సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచడంపై జేఆర్ పురం సీఐ ఎం.అవతారం జి.సిగడాం ఎస్ఐ వై.మధుసూదనరావును అభినందించారు.

## ఆక్రమణల చెరలో 'పోర్టుల్యాండ్'..?

- పట్టనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ సిబ్బంది
- గాలికొదిలేసిన పోర్టు అథారిటీస్



రాజారాంపురం వద్ద పోర్టుల్యాండ్‌లో అక్రమంగా తవ్విన చెరువు

**పోలాకి:** ఒకప్పుడు వెలుగు వెలిగిన కళింగపట్నం ఓడరేవు ఆ తర్వాత కాలంలో నౌకల రవాణా నిలిచిపోవడంతో సదరు ఓడరేవుకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. మండలంలో ప్రస్తుతం నిరుపయోగంగా కేవలం రెవెన్యూ రికార్డుల్లో మాత్రమే మిగిలిపోయిన పోర్ట్‌ల్యాండ్‌పై కొందరి కన్నుపడింది. అంపలాం పంచాయతీ పరిధి నందిగాం రెవెన్యూలో సర్వే నంబర్–77లో 31.45 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూములు ఇప్పుడు విలువైనవిగా మారడంతో కొందరు పెద్దలు అక్కడ గ్రద్దల అవతారం ఎత్తారు. గతంలో టీడీపీ హయాంలో(2014–19 మధ్యలో) అక్కడ మత్స్యకారుల విశ్రాంతి భవనం, వలలు, చేపలు నిల్వ గోదాముల నిర్మాణం చేపట్టిన సందర్భంలో సైతం పోర్టు అథారిటీస్ నుంచి ఎలాంటి క్లియరెన్స్‌లు ఇవ్వకపోయినా, అప్పటి నాయకత్వం ముందుకు వెళ్లడం వెనుక వేరే ఉద్దేశాలు ఉన్నాయనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇదిలా ఉండగా గత నాలుగేళ్ల నుంచి ఈ భూముల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు సైతం నిర్వహించడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. వేరే ప్రభుత్వ సర్వే నంబరుతో వర్క్ ఐడీ క్రియేట్ చేసి పోర్టు భూముల్లో ఉపాధి పనులు చేపడుతూ ప్రజావేదిక ఆడిటింగ్ సమయంలో మేనేజ్ చేస్తూ వస్తున్నారన్న ఆరోపణలు వున్నాయి.

**హక్కులు కల్పించాలని వినతి**

పోర్ట్‌ల్యాండ్ మొత్తం తమకే చెందుతుందని హక్కులు కల్పించాలని కోరుతూ ఇటీవల ఒక వ్యక్తి పోలాకి రెవెన్యూ కార్యాలయానికి వినతిపత్రం అందించిన నేపథ్యంలో ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. వినతి పత్రం వెనుక ఉన్నది ఎవరు అనే విషయంపై కూటమి పార్టీల నాయకుల్లో అంతర్గత చర్చ జరుగుతున్నట్లు సమాచారం. మరోపక్క పోర్టు భూముల్లో ఇప్పటికే ప్రైవేటు కార్యకలాపాలు జరుగుతున్నాయని సర్వే నిర్వహించి భూముల వివరాలు, వాస్తవ విస్తీర్ణంపై హద్దులతో సైతం ప్రజలకు తెలియజేయాలని మత్స్యకారులు, తీరప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ సిబ్బంది మాత్రం ఆక్రమణలపై ఎందుకో నిద్ర నటిస్తోంది. మరోపక్క తమ హక్కులను సైతం పోర్టు అథారిటీస్ గాలికొదిలేసింది. కనీసం తమ భూముల్లో ఫెన్సింగ్ వేసి భవిష్యత్ అవసరాలకు వినియోగించుకునే ఆలోచన కూడా చేయడం లేదు. ఇదే కొనసాగితే రూ.కోట్లు విలువ చేసే పోర్టుల్యాండ్‌లో అక్రమార్కులు లంగరు వేసే పరిస్థితి మరెంత దూరంలో లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.



పోర్టుల్యాండ్‌లో మత్స్యకారుల భవనాలు

### రికార్డుల్లో స్పష్టంగా ఉంది



రెవెన్యూ రికార్డుల్లో పోర్టుల్యాండ్ వివరాలు స్పష్టంగా ఉన్నాయి. నందిగాం రెవెన్యూలో ఎస్ఎల్‌ఆర్‌లో పోర్టు అథారిటీస్‌కు 31.45 ఎకరాల భూములు ఉన్నట్లు వివరాలు ఉన్నాయి. ఆక్రమణలపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. పోర్టు అథారిటీస్ వారు వచ్చి హద్దులు కోరితే చూపించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– పి.శ్రీనివాసరావు, తహసీల్దార్, పోలాకి

## క్లుప్తంగా

### కామర్స్ అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపక పోస్టును భర్తీ చేయడానికి గెస్ట్ లెక్చరర్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.ఉషశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. పీజీ అర్హత కలిగి ఉండాలని, నెట్,సెట్, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల10న కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### జిల్లా స్థాయి భజన పోటీలు రేపు

పాలకొండ: పట్టణంలోని ఏలాం సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయ మంటపం వద్ద బుధవారం జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. పోటీలో గెలుపొందిన భజన బృందాలకు మొదటి బహుమతిగా రూ.6వేలు, రెండవ బహుమతి రూ.5వేలు, మూడవ బహుమతి రూ.4 వేలు అందిస్తామని వివరించారు. అలాగే బెస్ట్ సింగర్, బెస్ట్ డోలక్, బెస్ట్ హార్మోనిస్టులను ఎంపిక చేసి బహుమతులు అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న భజన బృందాలు నేరుగా తమ కమిటీ సభ్యులను సంప్రదించాలని సూచించారు.

### నలుగురు జూదరుల అరెస్టు

లక్కవరపుకోట: మండలంలోని సంతపేట గ్రామం సమీపంలో పేకాట ఆడుతున్న వ్యక్తులపై ఎస్సై నవీన్‌పడాల్ నేతృత్వంలో పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.18,860 నగదు, రెండు జతల పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

### జిల్లా కేంద్రంలో గంజాయి కలకలం

• 24కేజీల గంజాయితో ఏడుగురి అరెస్ట్



నిందితుల వివరాలు సేకరిస్తున్న పట్టణ పోలీసులు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో సోమవారం ఒడిశా, ఉత్తర ప్రదేశ్‌లకు చెందిన ముఠా నుంచి ఓ ప్రైవేట్ లాడ్జిలో 24కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై గోవింద తెలిపారు. ఒడిశాకు చెందిన రామ్ ఖిల, రమేష్ కోరా, సంతోష్, ప్రశాంత్‌లు ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆకాష్, వినయ్, ప్రతాప్‌లకు లాడ్జి వద్ద గంజాయిని అందజేస్తున్న క్రమంలో ఒక సూట్‌కేస్, మరో బ్యాగ్‌లో అప్పజెప్పేందుకు ఉంచిన గంజాయితో పాటు వారిని పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఏడుగురు వ్యక్తులతో పాటు వారు ఉపయోగించిన కారును, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

### వట్టి గెడ్డలో రైతు గల్లంతు?

సాలూరు రూరల్: మండలంలోని దుద్దిసాగరం గ్రామానికి చెందిన మంచాల రామయ్య (45) సోమవారం వట్టి గెడ్డలో గల్లంతయ్యాడు. వట్టి గెడ్డ దాటి ఉన్న తన పొలం పనులకు రామయ్య సోమవారం ఉదయం వెళ్లి తిరిగి సాయంత్రం 5.30గంటల సమయంలో వస్తుండగా వట్టి గెడ్డలో దిగి వస్తుండగా గల్లంతయ్యాడని గ్రామస్తులు చెబుతున్నారు.అయితే వట్టిగెడ్డ ప్రవాహం ఉధృతంగా ఉండడంతో కొట్టుకుపోయాడని గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో గాలింపు చర్యలు చేపట్టారు.

### యడ్లవల్లికి హరికథా చూడామణి బిరుదు ప్రదానం



యడ్లవల్లికి హరికథా చూడామణి బిరుదు, పురస్కారం ప్రదానం చేస్తున్న కోలగట్ల శ్రావణి, ఆదిభట్ల ఆరాధనోత్సవ సంఘం ప్రతినిధులు

విజయనగరం టౌన్: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 161వ జయంత్యుత్సవం ఆదిభట్ల నారాయణదాసు ఆరాధనోత్సవ సంఘం ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్‌లో సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రీ అన్నమాచార్య కళాపీఠం పొద్దుటూరుకి చెందిన హరికథా భాగవతులు యడ్లవల్లి రమణయ్య భాగవతార్‌కు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి చేతుల మీదుగా హరికథా చూడామణి బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ కళలకు కాణాచిగా ప్రసిద్ధికెక్కిన విద్యలనగరంలో సాహితీ సంస్థల కృషి ఎనలేనిదన్నారు. పురస్కార గ్రహీత యడ్లవల్లి మాట్లాడుతూ విజయనగరంలో పురస్కారం పొందడం తన పూర్వజన్మసుకృతమన్నారు. అనంతరం యడ్లవల్లి చేసిన భక్త మార్కండేయ కథాగానం ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముందు హరికథా చూడామణి కళ్ల నిర్మల భాగవతారిణి నిర్వహించిన సుందరకాండ హరికథ ఆహుతుల కరతాళ ధ్వనులందుకుంది. సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్సవ సంఘ అధ్యక్షుడు పి.వి.నరసింహరాజు (బుచ్చిబాబు), సభాధ్యక్షుడు ఎ.రంగారావు దొర, ప్రతినిధులు సోమయాజులు, వై.బాబూరావు, ఎం.సుధాకర్, కోలపల్లి ధర్మ శ్రీరామబాబా, భోగరాజు సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వినతులపై తక్షణమే స్పందించాలి

• కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: పీజీఆర్ఎస్‌కు వచ్చిన సమస్యలకు సంబంధించిన వినతులపై తక్షణమే సంబంధిత అధికారులు స్పందించాలని కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు సబ్ కలెక్టర్ ఆర్.శాలి, డీఆర్‌ఓ హేమలత, ఎస్‌డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణిలు అర్జీదారుల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించిన కలెక్టర్ వారు తెలిపిన ప్రతి సమస్యను సావధానంగా విని తగిన పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు.

**వచ్చిన వినతుల్లో కొన్ని..**

సీతంపేట మండలం పాడిదుమ్ము నుంచి దారబంద వరకు రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాలి. కురుపాం మండలం పిరంగూడ నుంచి అడ్డాయిగూడ వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేయాలి. గుమ్మలక్ష్మీపురం మండలం గొరడ నుంచి వల్లాడ వరకు సీసీ రోడ్డు మంజూరు చేయాలి. కురుపాం మండలం పట్టాయి గెడ్డలో అంగన్వాడీ బిల్డింగ్ నిర్మాణం పూర్తిచేయాలి. గతేడాదిలో ఎంపికైన డీలర్లకు నియామక పత్రాలు మంజూరు చేయాలని తదితర సమస్యలపై పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 73 వినతులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖాధికారులు కె.రాబర్ట్‌పాల్, వై.క్రాంతికుమార్, టి. కొండలరావు, డా.ఎస్.భాస్కరరావు, ఐసీడీసీ, డ్వామా పీడీలు టి. కనకదుర్గ, కె.రామచంద్రరావు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, సీపీఓ ఎస్ఎస్ఆర్‌కె పట్నాయిక్, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**ఫిర్యాదుల పరిష్కారానికి ఎస్పీ ఆదేశాలు**



సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లా పోలీస్‌శాఖ కార్యాలయంలో ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి తన వద్దకు వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించేందుకు సంబంధిత స్టేషన్ అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు తన కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. వచ్చిన ఫిర్యాదుల్లో ప్రధానంగా కుటుంబకలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలపై విచారణ చేసి, చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో 7 ఫిర్యాదులు అందాయి. డీసీఆర్బీ సీఐ ఆదాం తదితర సిబ్బంది పాల్గొన్నారు.

**ఐటీడీఏ గ్రీవెన్స్ సెల్‌కు 55 అర్జీలు**



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న పీఓ స్వప్నిల్ జగన్నాథ్

సీతంపేట: ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వివిధ శాఖల సెక్టోరియల్ అధికారులు హాజరు కాకపోతే మెమోలు ఇవ్వాలని ఐటీడీఏ పీఓ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశమందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు సమయపాలన పాటించాలని, పీజీఆర్‌కు ఎవరెవరు వచ్చారో సంతకాలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.అందరూ బాధ్యతగా పనిచేసి వచ్చిన అర్జీలను తక్షణ పరిష్కారం చూపాలన్నారు. మొత్తం 55 అర్జీలు వివిధ సమస్యలపై వచ్చాయి. ఓంద్రుజోలలో జీపీఎస్ చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు వినతి ఇచ్చారు. తాగునీటి బోరు మంజూరు చేయాలని జరడగూడ గ్రామానికి చెందిన ఆరిక చిన్నారావు, తల్లికి వందనం డబ్బులు తమ పిల్లలు ఇద్దరికి రాలేదని పోలిష్‌కోటకు చెందిన బిడ్డిక బెన్నయ్య విన్నవించారు. భాషావలంటీర్‌ను నియమించాలని జన్నిగూడ గ్రామస్తులు కోరారు. ఆయిల్ ఇంజిన్ మంజూరు చేయాలని పోలవరానికి చెందిన ఊయక బోడమ్మ విన్నవించింది. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు, డిప్యూటీ ఈవో రామ్మోహన్‌రావు, ఎంపీడీవో సత్యం, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదు దారులకు కారణాలు తెలియజేయాలి

• కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరంఫోర్ట్: ప్రతి వారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చే వినతులకు సంపూర్ణ న్యాయం చేయాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేవిధంగా అర్జీలకు పరిష్కారం చూపించాలని సూచించారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 188 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు సంబంధించి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహిస్తామని తెలిపారు. అసలైన ఫిర్యాదుదారులకు న్యాయం చేకూర్చేవిధంగా అధికారులు వ్యవహరించాలన్నారు. సమస్య పరిష్కరించలేని పక్షంలో దానికి కారణాలు అర్జీదారులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. వినతుల పరిష్కారం పట్ల చిత్తశుద్ధి చూపాలని చెప్పారు. ఐటీ శాఖ వెబ్‌సైట్‌లో అన్ని శాఖలు వారివారి ముఖ్యమైన శాఖ మెమోలు, ప్రభుత్వ ఉత్తర్వుల కాపీలు వచ్చే గురువారంలోగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

**ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో చర్యలు**



ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ, ఏఎస్పీలు

విజయనగరం క్రైమ్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారుల నుంచి వినతులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, సమస్యలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఎస్పీ 28 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్సీ సీఐ ఏవీ లీలారావు, డీసీఆర్బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏనుగుల సంచార ప్రాంత పరిశీలన



తాలాడ ఐలమ్మ తోట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కన్జర్వేటర్ శాంతి ప్రియ పాండే,డీఎఫ్‌ఓ ప్రసూన బృందం

భామిని: మండలంలోని తాలాడ సమీప ఐలమ్మ తోటలో ఏనుగులు సంచరించిన ప్రాంతాలను విశాఖ ఫారెస్ట్ కన్జర్వేటర్ శాంతిప్రియ పాండే, జిల్లా ఫారెస్ట్ అధికారి జీపీపీ ప్రసూనల బృందం సోమవారం పరిశీలించింది, ఐలమ్మ తోట పక్కనే గల వంశధార నది తీరాన్ని కూడా సందర్శించారు. గడిచిన మూడేళ్లుగా వంశధార నదీ తీరంలో ఏనుగుల గుంపు ఎలా గడిపిందని మాత్రమే పరిశీలించారు. కూటమి నాయకులు చెబుతున్నట్లు గత మూడేళ్లుగా ఏనుగుల గుంపుతో రైతుల పడుతున్న ఇబ్బందులు తొలగించడానికి కాని, కుంకి ఏనుగులు తెచ్చి తరలించేందుకు చర్యలు తీసుకోవడం కోసం కానీ ఫారెస్టు అధికారులు చర్చించలేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఏనుగుల బెడద లేకపోయినా వాతావరణం మారగానే తిరిగి వస్తాయని స్థానికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ఏనుగుల గుంపు ఎందుకు నివాసముంటోందనని ఆలస్యంగా అటవీ శాఖాధికారులు పరిశీలించడం ఆశ్చర్యం కలిగించింది. కన్జర్వేటర్ శాంతి ప్రియ పాండేకు ఎలిఫెంట్ రేంజర్ మణికంఠేశ్వరరావు ఏనుగుల జాడలు వివరించారు. పాలకొండ రేంజర్ రామారావు,కొత్తూరు సెక్షన్ అధికారులు దాలినాయుడు, రామకృష్ణ, కేశవ, ట్రాకర్స్ ఉన్నారు.

# ట్రాక్టర్ మీదపడి యువకుడి మృతి



పొడ్ల రాము(ఫైల్)

తెర్లాం: మండలంలోని పెరుమాళి గ్రామంలో ట్రాక్టర్ మీదపడడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పెరుమాళి గ్రామానికి చెందిన పొడ్ల రాము(23) సోమవారం మధ్యాహ్నం ట్రాక్టర్‌ను కడిగేందుకు స్థానికంగా ఉన్న ఓ చెరువుకు తీసుకువెళ్లాడు. ట్రాక్టర్ కడగడం పూర్తవడంతో దాన్ని పైకి తెచ్చేందుకు డ్రైవింగ్ చేస్తుండగా ట్రాక్టర్ బురదలో కూరుకుపోయి ఇంజిన్ భాగం పైకి లేచిపోయింది. దీంతో ట్రాక్టర్ బోల్తాపడిపోతుందని గమనించిన డ్రైవర్ రాము వెంటనే కిందకు దూకేశాడు. దూకేసిన రాముపై ట్రాక్టర్ పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కొన ఊపిరి ఉందన్న అనుమానంతో కుటుంబ సభ్యులు రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి ప్రమాదం జరిగిన వెంటనే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై తెర్లాం ఎస్సై సాగర్‌బాబు వద్ద ప్రస్తావించగా దీనికి సంబంధించి ఇంతవరకు ఎటువంటి సమాచారం రాలేదని తెలిపారు.

**లారీ కింద పడి యువకుడు..**



ఎర్రయ్య మృతదేహం

విజయనగరం క్రైమ్: నగరంలోని జేఎన్టీయూ జంక్షన్ వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఇందుకు సంబంధించి వన్ టౌన్ సీఐ ఆర్వీఆర్‌కే చౌదరి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధుపాడకు చెందిన ఎర్రయ్య (21) తన స్నేహితుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా జేఎన్టీయూ వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఎర్రయ్య స్నేహితుడు ముందు పడిపోగా బైక్ నడుపుతున్న ఎర్రయ్య లారీ వెనక చక్రం వద్ద పడ్డాడు. ఆగి ఉన్న లారీ అప్పుడే బయలుదేరడంతో లారీ చక్రాలు ఎర్రయ్య మీద నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సీఐ చౌదరి ఆదేశాలతో ఎస్సై లక్ష్మనాయుడు మృతదేహాన్ని ప్రభుత్వ సర్వజన హాస్పిటల్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**వ్యాన్ ఢీకొని వృద్ధురాలు..**



అన్నపూర్ణ మృతదేహం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామంలో ఇంటిబయట కుర్చీలో కూర్చుని సేదదీరుతున్న వృద్ధురాలిని వ్యాన్ ఢీకొట్టడంతో మృతి చెందింది. ఈ ఘటనపై ఎస్సై గణేష్, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మజ్జి అన్నపూర్ణ(65) ఆదివారం రాత్రి పాన్ షాపు వద్ద కుర్చీలో కూర్చుని సేదదీరుతోంది. అదే సమయంలో నెల్లిమర్ల నుంచి వచ్చిన ఓ వ్యాన్ ఆ వృద్ధురాలిని బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. వ్యాన్‌ను నిర్లక్ష్యంగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. మృతురాలి అల్లుడు గురునాయుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

### ఆగి ఉన్న లారీని ఢీ కొన్న ఆటో



తీవ్ర గాయాలపాలైన ఆటోడ్రైవర్

బొండపల్లి: మండలంలోని చందకపేట గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి 26పై ఆగి ఉన్న లారీని వేగంగా వస్తున్న ఆటో ఢీ కొనడంతో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం వేకువ జామున జరి గిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలి లా ఉన్నాయి. విజయనగరం నుంచి గజపతినగరం వైపు మిరపకాయలు లోడుతో వెళ్తున్న ఆటో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బలంగా ఢీ కొట్టడంతో శ్రీకాకుళానికి చెందిన డ్రైవర్ చంద్రరావుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన డ్రైవర్‌ను జిల్లా కేంద్ర సర్వజన ఆస్పత్రికి చికిత్స కోసం తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సాగునీటి సరఫరాపై నిర్లక్ష్యం చేస్తే ఉద్యమిస్తాం



గరుగుబిల్లి మండలం కొత్తూరు వద్ద రైతుల ఆందోళన

• తోటపల్లి ఆయకట్టు రైతులు వెల్లడి

వంగర: తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన పాత కాలువ నుంచి వంగర మండలంలోని అన్ని గ్రామాల పంట భూములకు సాగునీటిని సరఫరా చేయకపోతే ఉద్యమిస్తామని రైతులు స్పష్టంచేశారు. మండలంలోని కె.కొత్తవలస, మద్దివలస, ఎం.సీతారాంపురం, కొప్పరవలస, బంగారువలస, రుషింగి, తలగాం గ్రామాలతో పాటు పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం పెద్దింపేట, పోలినాయుడువలస గ్రామాలకు చెందిన రైతులు మూకుమ్మడిగా ట్రాక్టర్లు, సైకిళ్లు, మోటారు సైకిళ్ల సహాయంతో కాలువ ఎగువ ప్రాంతంలోని కొత్తూరు వద్ద ఆందోళన చేశారు. సాగునీరు విడుదల చేసి 50 రోజులు గడస్తున్నా ఇంత వరకు వంగర మండలంలోని చాలా గ్రామాల భూములకు సరఫరాకాలేదన్నారు. రాజులగుమ్మడ సమీపంలో కాలువకు అడ్డంగా ఉన్న అడ్డుకట్టను రైతులు తొలగించారు. సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. డబ్బులు ఎత్తుబడి చేసుకుని కాలువలో జంగిల్, పూడికలు తొలగించినా సాగునీరు అందడంలేదని వాపోయారు. వంగర మండలంలో తోటపల్లి ఆయకట్టు 9వేల ఎకరాలకు సాగునీటి ఎద్దడి ఉందని, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

# సకాలంలో స్పందించిన 108 సిబ్బంది

• తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని సీహెచ్‌సీకి తరలింపు
• తప్పిన ప్రాణాపాయం



విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన దత్తి వాసుకు 108 వాహనంలో ప్రథమ చికిత్స అందిస్తున్న టెక్నీషియన్ వెంకటరమణ

తెర్లాం: 108 వాహన సిబ్బంది సకాలంలో స్పందించి ఆస్పత్రికి తీసుకువెళ్లి ఓ వ్యక్తిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. తెర్లాం మండలంలోని చుక్కవలస గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ దత్తి వాసు వ్యక్తి సోమవారం ఉదయం విద్యుత్ స్తంభం ఎక్కి పనిచేస్తుండగా షాక్‌కు గురై కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు తెర్లాం 108 వాహనానికి సమాచారం అందించారు. 108 వాహన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ బోను వెంకటరమణ, పైలట్ పుప్పాల గౌరీశంకర్‌లు సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య సేవల కోసం రాజాం సీహెచ్‌సీకి తరలించారు. విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని సకాలంలో ఆస్పత్రికి తీసుకురావడంతో ప్రాణాపాయ స్థితి తప్పిందని వైద్యులు 108 వాహన సిబ్బందిని మెచ్చుకున్నారు. గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్‌ను వ్యక్తిని కాపాడిన 108 వాహన టెక్నీషియన్, పైలట్‌ను కుటుంబ సభ్యులు, చుక్కవలస గ్రామస్తులు అభినందించారు.

# బావిలో పడి వ్యక్తి ఆత్మహత్య

కొమరాడ: మండలంలోని విక్రంపురం గ్రామానికి చెందిన తూతిక స్వామేశ్వరరావు(60)ఆదివారం అర్ధరాత్రి దిగువ వీధిలో ఉన్న మంచి నీటి బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కె.నీలకంఠం తెలిపారు. దీనిపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కిడ్నీ సంబంధిత వ్యాధి కారణంగా బాధపడుతున్న సోమేశ్వర రావుకు పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో డయాలసిస్ చేసినప్పటికీ నడుము నొప్పి ఎక్కువ ఉన్నందున బాధ తట్టులేక మానసికంగా కుంగిపోయి బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**విజయనగరంలో యువకుడు..**



గంగరాజు మృతదేహం

విజయనగరం క్రైమ్: రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి కొండకరకాం గ్రామానికి చెందిన పి.గంగరాజు(20) సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక అప్పులు చేసి, తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడని రూరల్ ఎస్సై అశోక్ తెలిపారు. మృతుని అన్నయ్య సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# వెయిట్ లిఫ్టింగ్‌లో అజేయుడు

• తండ్రి బాటలో రాణిస్తున్న తనయుడు
• కామన్‌వెల్త్ చాంపియన్ షిప్‌లో స్వర్ణం
• స్కాట్‌లాండ్‌లో జరగనున్న గేమ్స్‌కు ఎంపిక
• స్పోర్ట్స్ కోటాలో ఆర్మీలో ఉద్యోగం
• ప్రతిష్టాత్మక గేమ్స్‌లో స్వర్ణంపైనే గురి



2010 కామన్‌వెల్త్ గేమ్స్‌లో బరువును ఎత్తుతున్న వల్లూరి శ్రీనివాసరావు



ఇటీవల జరిగిన కామన్‌వెల్త్ చాంపియన్ షిప్ పోటీల్లో బరువును ఎత్తుతున్న వల్లూరి అజయ్‌బాబు



బంగారు పతకంతో అజయ్‌బాబు

నెల్లిమర్ల రూరల్: వారిది నిరుపేద కుటుంబం. కుటుంబ పోషణకు వ్యవసాయ పనులు చేస్తూ వచ్చిన కొద్దిపాటి కూలి డబ్బులతో సర్దుకుపోయే దుస్థితి. గ్రామీణ సంప్రదాయబద్ధ క్రీడల పట్ల ఆసక్తి ఆయనను అంచెలంచెలుగా ఎదిగేలా చేసింది. పెద్దగా చదువుకోకపోయినప్పటికీ నమ్ముకున్న క్రీడ ప్రస్తుతం ఉన్నత స్థాయిలో నిలబెట్టింది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పదుల సంఖ్యలో పతకాలు సాధించి దేశ, రాష్ట్ర, జిల్లా కీర్తిని ఖండతరాల్లో ఇనుమడింపజేశారు. ఆయనే విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన సీనియర్ వెయిట్‌లిఫ్టర్ వల్లూరి శ్రీనివాసరావు. 1997లో శిక్షణ ప్రారంభించిన ఆయన పలు రాష్ట్రాల్లో జరిగిన చాంపియన్ షిప్ పోటీల్లో వరుస బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఇండియన్ ఆర్మీలో సిపాయి స్థాయి నుంచి జేఏఓ కేడర్ వరకు ఎదిగి ప్రస్తుతం రిటైర్ అయ్యారు. గ్రామంలోనే ఉంటూ మరికొంత మంది క్రీడాకారులను తయారు చేస్తున్నారు. వల్లూరి శ్రీనివాసరావు పెద్ద కుమారుడు అజయ్ బాబు తండ్రి సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని తన 8వ ఏట నుంచే వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ ప్రారంభించాడు. 2021లో జాతీయస్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని యూత్ విభాగంలో తొలి స్వర్ణం సాధించాడు. 2022 జూలైలో ఉజెబికిస్తాన్, 2022 అక్టోబర్‌లో బహ్రెయిన్, 2023లో యూపీ(ఇండియా), 2024 డిసెంబర్‌లో ఖతర్, ఉజెబికిస్తాన్, అదే ఏడాది సెప్టెంబర్‌లో ఫిజ్జి దేశాల్లో వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో సత్తా చాటాడు. ప్రస్తుతం పాటియాలాలోని ఓ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. తండ్రిని ఆదర్శంగా తీసుకున్న అజయ్‌బాబు వరుస విజయాలు సాధిస్తూ మరికొందరికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.

**ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం**

వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో రాణించేందుకు అజయ్ బాబు ప్రస్తుతం పాటియాలాలోని ఓ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. శిక్షణకు సంబంధించి అకాడమీ ఖర్చులు భరిస్తున్నప్పటికీ అదనంగా నెలకు రూ.40వేలు ఖర్చు అవుతున్నట్లు తండ్రి శ్రీనివాసరావు చెబుతున్నారు. గేమ్స్‌లో రాణించడమే తన కుమారుడి లక్ష్యమని లక్ష్య సాధనకు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి ఈ స్థాయికి వచ్చినట్లు తెలిపారు. వెయిట్‌లిఫ్టింగ్‌లో రాణిస్తున్న అజయ్ బాబు ఆ కోటాలో ఇటీవల ఇండియన్ ఆర్మీలో జేఏఓ కేడర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. మరో నెల రోజుల్లో బాధ్యతలు కూడా స్వీకరించనున్నాడు.

**స్కాట్‌లాండ్‌లో జరగనున్న పోటీలకు ఎంపిక**

ఇటీవల గుజరాత్ రాష్ట్రంలో జరిగిన కామన్‌వెల్త్ చాంపియన్‌షిప్ పోటీల్లో అజయ్‌బాబు స్వర్ణ పతకం సాధించడంతో 2026 జూలై 23 నుంచి స్కాట్‌లాండ్‌లో జరగనున్న అంతర్జాతీయ గేమ్స్‌కు అర్హత సాధించాడు. ఆ పోటీల్లో తన కుమారుడు తప్పనిసరిగా స్వర్ణం సాధిస్తాడని తండ్రి శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు.